ఆల్తి అప్పలనాయుడు ఆశయ సాధనకు కృషి చేస్తాం

సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విశాలాంధ్ర - గజపతినగరం : గజపతి నగరంలోని కామ్రేడ్ ఆల్తి అప్పలనాయుడు ద్వితీయ వర్ధంతి సందర్భంగా మంగళవారం సిపిఐ జిల్లా పార్టీ కార్యదర్శి ఒమ్మి రమణ వారి స్వగ్రహ మందు అప్పలనాయుడు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఆల్తి ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు కీర్తిశేషులు కామ్రేడ్ అప్పలనాయుడు సేవలను కొనియాడారు ఆయన లేని లోటు ఈ లోకానికి తీరని లోటని అన్నారు అనంతరం ఆయన భౌతిక కాయం వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకానికి వెళ్లి ప్రతిజ్ఞ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహాదేవ శ్రీనివాసరావు గేదెల రామనాయుడు వారి కుటుంబ సభ్యులు భార్య ఆల్తి వరలక్ష్మి కుమారులు రాజేశ్వరరావు అజయ్ కోడలు తేజస్విని మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

49వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ పరిధి 49వ డివిజన్ 59వ సచివాలయం గాజు లరేగ ఆచంటనగర్ నుంచి మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏపీ శాసనసభ ఉపసభాపతి శ్రీ కోలగట్ల వీరభద్రస్వామి గారు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరించారు. ఆయా కుటుంబాలు పొందిన ప్రభుత్వ పథకాల లబ్ధిని చదివి వినిపించారు. ప్రభుత్వ పాలన తీరుపై ఆరా తీయగా.. ప్రతీ ఒక్కరి నుంచి సంతృప్తి వ్యక్తమైంది. అవినీతికి తావు లేకుండా, ఎవరికీ రూపాయి కూడా లంచం ఇవ్వకుండా సంక్షేమ ఫలాలు అందుకుంటున్నామని ఈ సందర్భంగా ప్రజలు ఆయనకు వివరించారు. కొన్నిచోట్ల కాలువలు, విద్యుత్ సంబంధిత సమస్యలను స్థానికులు తీసుకురాగా, వెను వెంటనే అధికారులతో మాట్లాడిన కోలగట్ల..వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ లయ యాదవ్, వైసీపీ పట్టణ అధ్యక్షులు ఆశపు వేణు, జోనల్ ఇంచార్జ్ తమ్మన్న శెట్టి, పలు విభాగాల ప్రభుత్వ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ శృతి

విశాలాంధ్ర - మెంటాడ : వాతావరణ ప్రతికూల పరిస్థితులు వలన దోమలు విస్తారమై ప్రజలలో దోమ కాటు వలన అనేక భయంకరమైన రోగాలు వచ్చే అవకాశం ఉందని వర్షాకాల ప్రారంభ దశలో దోమల వలన వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని మెంటాడ ప్రాథమిక హాస్పిటల్ వైద్యాధికారి శృతి అన్నారు. మంగళవారం ఆంధ్ర గ్రామంలో క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు మండల అధికారులు తో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ సీజన్లో డెంగ్యూ మలేరియా తో పాటు అనేక భయంకరమైన రోగాలు వచ్చే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని వివిధ గ్రామాలలో ప్రభుత్వం చే పంపిణీ చేయబడిన దోమల తెరలు ఉపయోగించుకోవాలని దోమల నుండి రక్షించుకునే వివిధ మార్గాలను అనుసరించాలని సూచనలు చేశారు. ఇంటింటికి తిరుగుతూ ప్రతి వీధి కాలువల లో స్ప్రేయింగ్ కూడా చేయడం జరిగింది ప్రతి వారం ఫ్రైడే డ్రై డే గా పాటించినప్పుడు కొంత మేరకు దోమలను నిర్మూలించగలమని వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు ఇంటి పరిసరాల పరిశుభ్రత కూడా పాటించవలసిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా అదికారి శ్రీ నువాసరావు మరో వైద్యాధికారి లోకప్రియ ఎంపీడీవో త్రివిక్రమరావు, ఎమ్మార్వో రామకృష్ణ, సి.హెచ్.ఓ సత్యనారాయణ హెచ్.వి జ్యోతి. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి...హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం

రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డా. డీవీజీ శంకరరావు

విశాలాంధ్ర - విజయనగరం : రాష్ట్రం లోని గిరిజనుల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం కల్పిస్తూ తన కర్తవ్యాన్ని, బాధ్యతలను నిర్వర్తిస్తానని.. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ వారిలో చైతన్యం నింపుతానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డా. డీవీజీ శంకరరావు అన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ.. గిరిజన ప్రజలను నాగరికతకు, అభివృద్ధికి మరింత చేరువ చేసేందుకు కమిషన్ తరఫున తగిన చర్యలు తీసు కుంటామని పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సారిగా మంగళవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో విలేకరులతో సమావేశం అయ్యారు. గిరిజన ప్రజల దీర్ఘకాలిక సమస్యలు, హక్కులు పరిరక్షణ, చట్టాల పర్య వేక్షణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై మాట్లాడారు. కమిషన్ తరఫున రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తామని, వారి హక్కులు, చట్టాల అమలుపై వారిలో చైతన్యం నింపుతామని ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి ఇప్పటికే పలు పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. వారి అభ్యున్నతికి, ఉన్నత లక్ష్యాల సాధనకు కమిషన్ ఎప్పుడూ అండగా నిలుస్తుందని ఛైర్మన్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాలసీ విధానాల రూపకల్పనలో భాగస్వామ్యం అవుతూ, నిష్పక్షపాత సేవలు అందించేందుకు కమిషన్ ప్రధాన పాత్ర పోషిస్తుందని అన్నారు. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ గిరిజనుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తామని, పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. చట్టాల ఉల్లంఘనలు జరగకుండా పూర్తి స్థాయిలో బాధ్యతగా వ్యవహరిస్తూ గిరిజన ప్రజలకు అన్ని విధాలా అండగా నిలుస్తామన్నారు. అన్ని విభాగాలు, ముఖ్యంగా మీడియా సహకారం తీసుకొని గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహిస్తామని, గిరిజన చట్టాలు, హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డా. డీవీజీ శంకరరావు పేర్కొన్నారు. ఎస్టీ కుల ధృవీకరణ పత్రాల జారీ, డోలీ కష్టాలు, బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చుట, విజయనగరం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు, గిరిజన ప్రాంతాల్లో రోడ్ల సదుపాయాలపై విలేకరులు ప్రశ్నలు అడగ్గా క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి పరిశీలించి పూర్తి స్థాయి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

అర్బన్ హెల్త్ సెంటర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

విశాలాంధ్ర - బొబ్బిలి : వార్డు సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని ఇందిరమ్మ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనుల్లో భాగంగా ఫ్లోరింగ్ వైరింగ్ పనులు ఈనెల 10 లాగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం పట్టణం ఇందిరమ్మ కాలనీలో వార్డు సచివాలయం సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన చేశారు. పర్యటనలో భాగంగా కమిషనర్ శానిటరీ ఇన్స్పెక్టర్, అసిస్టెంట్ ఇంజనీరు, ఇన్చార్జ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ మరియు వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో ఇందిరమ్మ కాలనీలో పర్యటించారు. ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మితమవుతున్న అర్బన్ హెల్త్ సెంటర్ ను పరిశీలించి అక్కడ ఉన్న సూపర్వైజర్‌కు ఈనెల తే. 10 లోగా ఫ్లోరింగ్ మరియు వైరింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ కాలనీలో ఒక షాపు వద్ద చెత్తను కాల్చుతున్నట్లుగా గుర్తించి అతడిని మందలించి జరిమానా విధించ వలసిందిగా సంబందించి శానిటేషన్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ వారిని ఆదేశించారు. చెత్తను కాల్చితే ఉపేక్షించేది లేదని, చెత్తను నేరుగా మునిసిపల్ వాహనానికి మాత్రమే అందించాలని తెలియజేశారు. నిర్మాణ ంలో ఉన్న ఇళ్లను పరిశీలించి వాటికి ప్లాను ఉన్నది లేనిది తెలుసు కొని తనకు సమాచారం అందించాలని టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వారికి ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయం బలోపేతం

విశాలాంధ్ర - పూసపాటిరేగ : ప్రకృతి వ్యవసాయంకి అవసరమైన అనేక రకాల కషాయాలను అందు బాటులోకి తెచ్చారు పూసపాటిరేగ మండలం ఎరుకొండ గ్రామంలో మంగళ వారం నాడు ప్రకృతి వ్యవసాయంలో వాడే పలు రకాల కషాయాలు దశ వర్ణ కషాయం, నియమాస్త్రం, పుల్లటి మజ్జిగ, అగ్ని అస్త్రం వంటి పలు రకాల కషాయాలు తయారు చేశారు ఈ కషా యాన్ని ఎలా ఉపయోగించాలో రైతులకు వివరించారు. ఈ కషా యాల వల్ల పంటలకు సూక్ష్మ స్థూల పోషకాలం అందుతాయని రైతులకు వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో లక్ష్మి, ఎస్.అశ్విని కుమారి, రైతులు పాల్గొన్నారు.

నూతన సచివాయాలతో గ్రామాలు మరింత అభివృద్ధి

ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

విశాలాంధ్ర - జామి : గ్రామాలలో ఇప్పటీ వరకు శిథిల భవనాలలో సచివాలయాలను నిర్వహించే వారని, కానీ జగనన్న ప్రభుత్వంలో ప్రతీ పంచాయతీలో నూతనంగా సచివాలయ భవనాలను నిర్మించడంతో మరింత అభివృద్ధి జరుగుతోందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. మంగళవారం మండలంలోని అట్టాడలో నూతనంగా ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.35లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంబించారు. ఎమ్మెల్యేకు అట్టాడ సర్పంచ్ పోతల అమ్మన్న దొర దంపతులు స్వాగతం పలికారు. అనంతరం భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే నిర్మాణం పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సచివాలయ వ్యవస్థ ఒక పెద్ద వ్యవస్థగా రూపాంతరం చెందిందని, గాంధీజీ కలలు గన్న గ్రామ పరిపాలన ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి ద్వారా సాధ్యమయిందని అన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా సచివాలయ ఆవరణలో మొక్కలను నాటారు. ఈకార్యక్రమంలో జెడ్పిటిసి గొర్లె సరయు, ఎంపిపి సబ్బవరపు అరుణ, ఎఎంసి చైర్మన్ ముత్యాల నాయుడు, రాష్ట్ర కార్పోరేషన్ డైరక్టర్ చలుమూరి సత్యారావు, మండల వైసీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్, డిసిసిబి డైరక్టర్ పి. సంజీవి, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ గుడివాడ రాజేశ్వరరావు, ఎంపిడివో ఎం.సతీష్, వివిధ శాఖల అధికారులు, స్థానిక నేతలు కనకారావు,పాడిపిరెడ్డి శ్రీను, బేపల సత్యం, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో వైసీపీ ఎమ్మెల్యే ఇంటికి వెళ్ళే రోడ్డు చిత్తడిగా మారింది

మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డు, శివాలయం వద్ద ఉన్న స్థానిక ఎస్ఆర్ఐ వైసీపీ ఎమ్మెల్యే ఇంటికి వెళ్ళే రోడ్డు చినుకులు పడితే చాలు చిత్తడిగా మారి రాక పోకలకు చాలా ఇబ్బందులు కలిగిసు న్నాయని నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శృంగవరపు కోట తెలుగుదేశం పార్టీ నాయకుల సమక్షములో పుణ్యగిరికి వెళ్లే ప్రధాన రోడ్డును మంగళవారం పర్యవేక్షించి రోడ్లు ఇలా అయితే రాకపోకలు ఎలా? జరుగుతాయని స్థానిక ఎస్.ఆర్.ఐ వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న ప్రజాప్రతినిధులను ప్రశ్నించారు. అసలు స్థానిక ప్రజాప్రతినిధులు నియోజకవర్గంలో ఉంటే, నియోజకవర్గంలోని సమస్యలుగానీ, ప్రజా సమస్యలుగానీ తెలుస్తాయని ఆమె విమర్శించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ నిత్యం పుణ్యగిరి శ్రీఉమా కోటిలింగేశ్వర స్వామి దేవాలయానికి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, పుణ్యగిరి రోడ్డులో గల శివాలయం చుట్టూ ఉన్న దేవాల యాలకు రోజూ అనేక మంది పుణ్యగిరి, బర్మా కాలనీ, రైల్వేక్వాటర్స్ నుండి స్థానిక ప్రజలు రాక పోకలు ఈ మార్గంలోనే కొనసాగిస్తున్నారని ఆమె తెలిపారు. వీలైనంత త్వరగా రోడ్డులో పడిన గుంతలను పూడ్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శృంగవరపుకోట మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్.నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, మాజీ ఎంపీటీసీ గన్ను బంగారమ్మ, ఎస్.కోట పట్టణ పార్టీ అధ్యక్షులు కొనదం మల్లేశ్వరరావు, గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, రాష్ట్ర ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి చీపురుపల్లి సాగర్ కళ్యాణ్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలపై ఎంపీడీఓ సమీక్ష

విశాలాంధ్ర - తెర్లాం : మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర పోటీలపై వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో విధి విధానపు సమీక్షను నిర్వహించిన గౌరవ ఎంపీడీఓ ఎస్ రామాకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ తేదీ అక్టోబర్ 2 కీ.శే.గాంధీజీ గారి జయంతిని పురస్కరించుకొని ఆడుదాం ఆంధ్రలి అనే కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందని ఈ ఆటలకు 17 ఏళ్ళు నిండిన వారు ఎవరైనా సరే సచివాలయంలో పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం యువత క్రీడలు మరియు ఆటలలో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించి, ప్రతిభను గుర్తించడానికి మన ప్రభుత్వం ఈ సంవత్సరం నుండి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం క్రింద వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖో-ఖో మరియు బాల్ బాడ్మింటన్ తదితర క్రీడలను గ్రామ, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు వార్షిక క్రీడా ఉత్సవాలను నిర్వహించనుందని తెలిపారు. మరియు అన్ని మండలాల్లో క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించి క్రీడాకారులకు కిట్‌లను గౌరవ ప్రభుత్వం ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం గూర్చి ప్రతీ పల్లెలోను అవగాహనా కార్యక్రమం నిర్వహించాలని కార్యదర్శులకు ఆదేశించారు. ఈ సమీక్షలో మండలాధికారులు పాల్గొన్నారు.

రాజపులోవలో త్రాగునీటి సమస్య

విశాలాంధ్ర - భోగాపురం : మండల పరిధిలోగల రాజాపులోవ గ్రామపంచాయతీలో గత వారం రోజులుగా ప్రజలు త్రాగునీటికి కటకట లాడుతున్న పరిస్థితి దాపురించింది. ఈ విషయమై గ్రామంలో పరిస్థితి పరిశీలించగా గత వారం రోజులుగా త్రాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, త్రాగునీటి కోసం చాలా దూరం వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గ్రామం కొండ ప్రాంతం కావడంతో నీటిని క్రింద నుంచి పైకి తీసుకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. వారంలో రెండు రోజులు, నెలకు కనీసం 7 రోజులు నీళ్లు రావడం లేదని, ఈ సమస్య అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే పంప్ హౌస్ నిర్వహణకు వేరే గ్రామ వ్యక్తిని నియమించడం వల్ల ఆవ్యక్తి సక్రమంగా విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల కూడా సక్రమమైన సేవలు అందడం లేదని, కాబట్టి స్థానికులకు ఆ అవకాశాన్ని కల్పించాలని కూడా డిమాండ్ వినిపిస్తోంది. అయితే మరికొందరు గ్రామస్తులు కథనం ప్రకారం పంప్ హౌస్ లో ఫ్యూజ్ పోయినా సరే విజయనగరం నుండి ఎలక్ట్రీషన్ వచ్చి ఫీజు వేసే పరిస్థితి తప్పితే స్థానికంగా ఉన్న ఎవరూ చొరవ తీసుకోవడం లేదు అనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ విషయమై సర్పంచ్ కిలారి స్వప్నను వివరణ కోరగా గత వారం రోజులుగా కుళాయిలో నీళ్లు రావడం లేదన్నది వాస్తవమేనని, విషయాన్ని ఉన్నతాధికారులకు ప్రతిరోజు విన్నవిస్తూనే ఉన్నామని చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయమై డి ఈ ఈ వైకుంఠనాయుడును వివరణ కోరగా అసలు రాజపులోవ గ్రామం లో త్రాగునీటి సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం. సంబంధిత అధికారులు స్పందించి సత్వరమే గ్రామంలో త్రాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు విజయవంతం

సీపీఐ జిల్లా కార్యదర్శి మన్మధరావు

విశాలాంధ్ర - బెలగాం : ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభలకు పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 30 మంది గిరిజన ప్రతినిధులు వెళ్లడం జరిగిందని సిపిఐ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు తెలిపారు. మహాసభలో గిరిజన సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా తన నియామకం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల అనంతరం జిల్లాకు తిరిగి రావడమైందని గిరిజన మహాసభలు సుధీరమైనటు వంటి సమస్యల పైన పోరాటాలు చేయాలని పిలుపు నివ్వడమైందని గిరిజన హక్కులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని దీని తరుపున హక్కులు సాధనకై సుదీర్ఘమైన పోరాటాలు చేయాలని పిలుపునిచ్చాయని తెలిపారు. జీఓ నెంబర్ 52 , జీవో నెంబర్ 3ల వలన గిరిజనులు అన్ని హక్కులు సర్వం కోల్పోయే ప్రమాదంలో పడేటట్లు పాలక ప్రభుత్వాలు చేస్తున్న విధానాన్ని తిప్పి కొట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య గౌరవ అధ్యక్షులుగా తనకు రాష్ట్రస్థాయిలో పదవి కల్పించినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. రాయచోటి నుంచి బయలుదేరి 30 మంది గిరిజన ప్రతినిధులు పార్వతీపురం చేరుకొని రాష్ట్ర సంఘ పిలుపును అనుసరించి ఉద్యమాలు చేపట్టాలని ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఈనెల మూడవ తేదీన గిరిజనుల సమస్యల పై జీవో నెంబర్ 3 రద్దు పైన జీవో నంబరు 52ను రద్దు పరిచే వరకు పోరాటాలు చేయాలని మూడవ తేదీ రాష్ట్ర రాష్ట్ర బందుకు అందరూ బాధ్యత తీసుకొని బంద్ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు పువ్వల ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మండంగి నీలమ్మ, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధుల్లో హరిత రాయబారుల వేతనాలు చెల్లించండి

విశాలాంధ్ర - సీతానగరం : ఇటీవల గ్రామ పంచాయతీలకు జమఅయిన 15వ ఆర్థిక సంఘం నిధుల్లో మొదటి ప్రాధాన్యతగా గ్రామాల్లోని చెత్తను తొలగించే హరిత రాయబారులు వేతనాలు చెల్లించం డని ఎంపిడిఓ ప్రసాద్, ఈఓపిఆర్డీ వర్మలు పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్య దర్శులతో సమావేశం నిర్వహించి, పిఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లింపులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరు, జిల్లా పంచాయతీ అధికారి అదేశాలు,సూచనలు మేరకు తప్పనిసరిగా హరిత రాయబారుల వేతనాలు చెల్లించాలని కోరారు. ఇటీవల సమిత్వ ద్వారా సర్వే నిర్వహించి గ్రామ కంఠాల గుర్తింపుచేసిన గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ కంటాల్లో అదనపు నిర్మాణాలు, పదిఇళ్లు ఒకే చోట నిర్మించిన వాటిని పరిశీలించి వాటిని విస్తరించిన గ్రామ కంఠంగా గుర్తించాలని కోరారు. జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చే పిర్యాదులు ఆన్లైన్ లో నమోదు,పరిష్కారం చేయాలని కోరారు. ప్రియా సాఫ్ట్ వేర్ ద్వారా 2021- 2022 ఆర్థిక సంవత్సర ఆదాయ వ్యయాలు పూర్తి చేసిన గ్రామ పంచాయతీలు 2022-2023 ఆర్థికసంవత్సర ఆదాయ వ్యయాలను ప్రియా సాఫ్ట్ వేర్ ద్వారా పూర్తి చేయాలని కోరారు. ఈ సాఫ్ట్ వేర్ పనులను పూర్తిచేసి ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాలని కోరారు. గ్రామాల్లోని వర్షాల వల్ల అంటు వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు. కార్యదర్శుల సందేహాలు నివృత్తి చేశారు. ఈసమావేశంలో 35గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం రెండోపూట 21 గ్రామ సచివాలయంల ఇంజినీరింగ్ సహా యకులతో ఎంపిడిఓ ప్రసాద్ సమావేశం నిర్వహించి గ్రామాల్లోని అభివృద్ధి పనులు, గృహ నిర్మాణ పనులు, నాడు నేడు పనులు వేగవంతంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని కోరారు.

రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు సంబంధించి రైతులకు ఎటువంటి ఎరువుల కొరత లేకుండా చూడాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ కార్యాలయంలోని వ్యవసాయ సహాయ సంచాలకురాలు బి.శారదకు వినతి పత్రాన్ని జనసేన పార్టీ జిల్లా నాయకులు వంగల దాలి నాయుడు, అన్నా బత్తుల దుర్గాప్రసాద్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో రైతులకు అందించాల్సిన ఎరువులు, పురుగుమందులు, యంత్రాలు సౌకర్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా లో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ముమ్మరంగా దమ్ము పనులు చేపడుతున్నారన్నారు. కాబట్టి రైతులకు ఇప్పుడు ఎరువులు, పురుగు మందులు అవసరం పడదన్నారు. కాబట్టి రైతులుగా అవసరమైన ఎరువులు పురుగు మందులకు ఎటువంటి కొరత లేకుండా రైతులు కోరినవి మాత్రమే స్టాండర్డ్ కంపెనీలవి అందజేయాలన్నారు. ఈ ఏడాది రైతుల కోరిన వరి విత్తనాలు సంపత్ స్వర్ణ -130 సరఫరా చేయకపోవడంతో రైతులు అధిక మొత్తాన్ని చెల్లించి బయట కొనుక్కునే పరిస్థితి వచ్చిందన్నారు. అలాగే ఎరువులు విషయంలో అటువంటి పరిస్థితి తీసుకురావద్దన్నారు. పురుగు మందులు స్ప్రే చేసేందుకు కిసాన్ డ్రోన్ స్ప్రేయర్లు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

జోరు వానలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - పాచిపెంట : మండల కేంద్రమైన పాచిపెంటలో రెండో రోజైన మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జోరు వానలో కొనసాగింది. గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు మరియు ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర జోరు వానలో కార్యక్రమం నిర్వహించడం అందరిని అబ్బుర పరిచింది మంగళవారం ఉదయం గాజులు వీధిలో ప్రారంభించిన ఈ కార్య క్రమం ఎడ్ల వీధి ఇరుకువేది కనకల వీధి పోతుల వీధి నడిపిల్లి వారి వీధి బాలివేది పల్లేడ వీధి గొల్ల వీధి ఈ కార్యక్రమం కొనసాగింది కాళ్లు ఓచిపోయిన కనీస విశ్రాంతి తీసుకోకుండా ముందుకు సాగిన ఉప ముఖ్యమంత్రి ఓపికను చూసిన అధికారులు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పోలీస్ శాఖ సిబ్బంది ఆశ్చర్య పోయారు ఆయనకున్న కమిట్మెంట్ చూసి జోరున వర్షం పడుతున్న ఆయన వెంట వెళ్లి సమస్యలు పరిష్కారానికి ఉపముఖ్యమంత్రి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు భోజనం విరామంలో సైతం ఎక్కువ సమయం తీసుకోకుండా వెంటనే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాలు ప్రారంభించడం ఎక్కడ ఉన్న వారిని ఒక విధంగా ఆశ్చర్యనికి గురిచేసింది. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి ఒకవేళ అర్హత ఉన్న సంక్షేమ పథకాల అందకపోతే ఎందుకు అందలేదు సంబంధిత అధికారులు అడిగి తెలుసుకుని పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు. అన్ని పథకాలపై ఆరా తీసి వెంటనే సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేస్తూ అర్హులకు పథకాలు అందే విధంగా చేయాలని ఆదేశాలు జారీ చేస్తూనే ముందుకు సాగిపోయారు ఈ సందర్భంగా ఇన్ని పథకాలు మీ ఇంటికే తీసుకువచ్చే అందుతున్నాయా లేదని తెలుసుకునేందుకు మంత్రులు అధికారులు మీ ఇంటికి రావడం ఎప్పుడైనా చూశారా అంటూ ప్రజలను అడిగి తెలుసుకునే వారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజలు ఇచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశా ఎట్టారని అన్నారు ప్రతి శాఖ అధికారి ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు సమస్యలు పరిష్కారానికి పూర్తిస్థాయి సమాచారంతో ఉండాలని అన్నారు మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే మరిన్ని పథకాలు మీ చెంతకే చేరుతాయని ప్రజలకు చెబుతూనే ముందుకు సాగిపోయారు ఈ కార్య క్రమంలో వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి డాలర్ బాబ్జి వైస్ ఎంపీపీ నారాయణమ్మ మాజీ వైస్ ఎంపీపీ మరియు జేఏసీ కన్వీనర్ తట్టికాయలు గౌరీశ్వరరావు మాజీ విద్యా కమిటీ చైర్మన్ మీసాల చంటి తో పాటు వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసిన పీఓ

విశాలాంధ్ర - పార్వతీపురం : జియ్యమ్మవలస మండలంలోని వి.టి.మండ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ మంగళ వారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజ రును, సరుకుల లభ్యత రిజిస్టర్‌లను ప్రాజెక్ట్ అధికారి తనిఖీ చేశారు. జగనన్న విద్యా కిట్లు పంపిణీ తనిఖీ చేసి విద్యార్థులు అందరికీ కిట్లు అందాయా అని ఆరా తీసారు. మధ్యాహ్నం భోజనంను పరిశీ లించారు. ఆహార పదార్థాల తయారీలో ఎటువంటి అశ్రద్ధ ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. విద్యా బోధనలో మరింత దృష్టి సారించాలని, ఆదర్శంగా నిలవాలని ఆయన చెప్పారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నత చదువులు అందుకోవాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు మంచి పునాదులు వేయాలని ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు సత్వరమే ఆధార్ సేవలు అందించాలి : ఏపీఓ వై.రోసిరెడ్డి

విశాలాంధ్ర - సీతంపేట : మండలంలో మారుమూల గిరిజన ప్రాంతాల గిరిజనులకు సత్వరమే ఆధార్ అప్డేషన్, ఆధార్ సేవలు అందించాలని ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి తెలిపారు. బ్లూ 3 ఐటి సొల్యూషన్స్ మరియు విద్యాశాఖ సౌజన్యంతో కొత్తగా మంజూరు చేసిన 5 ఆధార్ మొబైల్ కిట్స్ సీతంపేట వైటీసీలో ఏపీవో చేతుల మీదుగా యూనిట్ కిట్లను ఆపరేటర్లకు అందజేశారు. గిరిజన గ్రామాల్లోకి వెళ్లి వారికి అవగాహన కల్పించి, వారికి అవసరమయ్యే సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లూ 3 ఐటీ సొల్యూషన్ రీజినల్ మేనేజర్ డేవిడ్ కమలాకర్, కోఆర్డినేటర్లు డేవిడ్, నాగరాజు మరియు ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆధ్వర్యంలో కూరగాయల నమూనా పంటలు ఏర్పాటు

విశాలాంధ్ర - పార్వతీపురం : మండలంలోని పెదబొండ పల్లి, పుట్టూరు గ్రామాల్లోని రైతుల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా ఒకేచోట కూరగాయల నమూనా పంటలు ఏర్పాటును జిల్లా ప్రోజెక్టు మేనేజర్ షణ్ముఖ రాజు మంగళ వారం పరిశీలించారు.రైతులచే ఒకే ప్లాట్ లో వేయించినటు వంటి 10 నుంచి 14 రకాల అయినటువంటి కాయ గూరలు, ఆకుకూరలు, దుంపజాతి తదితర పంటల సాగుద్వారా మంచి ఆహారపదార్థాలు లభిస్తాయని తెలిపారు. దీన్నే ఏటిఎం మోడల్ గా పిలుస్తున్నట్లు తెలిపారు. రైతు మాటలలో రోజుకి 300 నుంచి 500 రూపాయలవరకు 15 సెంట్లలో ఇటువంటి ఏటిఎం మోడల్ సాగు ద్వారా పలు పంటలు పండించడం ద్వారా ఆదాయం తీసుకున్నట్టు రైతు పి.రామారావు వెల్లడించారు. ప్రతి రైతుకూడా ఈ విధంగా ఏటిఎం మోడల్ తరహాలో కూరగాయలు వేసుకున్నట్లయితే ప్రతిరోజు ఆదాయం పొంద వచ్చునని పలువురు రైతులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందవచ్చునని చెప్పారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

ఈనెల 3న ఐటిఐ అభ్యర్థులకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర - సీతంపేట : డైరెక్టర్ ఉపాధి మరియు శిక్షణ ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు 2023 సంవత్సరం సంబంధించి ఐటిఐ వివిధ ట్రేడ్లకు సంబంధించి మిగిలి ఉన్న సీట్లకు గాను రెండో విడతలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మూడవ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఐటిఐ కు కౌన్సిలింగ్ నిమిత్తం అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తో పాటు జిరాక్స్ కాపీలు, పాస్ ఫోటోలతో హాజరు కావాలని ప్రిన్సిపల్ ఎం గోపాల్ కృష్ణ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఫిట్టర్, మెకానిక్ మోటార్ వెహికల్, వెల్డర్, కోప కంప్యూటర్, డ్రెస్ మేకింగ్ ట్రేడల్లో సీట్లు సంబంధించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాల నిమిత్తం ఈ క్రింది తెలిపిన ఫోన్ నెంబర్లకు కాంట్రాక్ట్ అవ్వాలని తెలిపారు. 7569062449,9948582309.

సమస్యలు పరిష్కరించకపోతే సంగ్రామ యాత్ర సమరయాత్రగా మారుతుంది

ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ హెచ్చరిక

విశాలాంధ్ర -శృంగవరపుకోట : సమస్యలు పరిష్కారం చేయకుంటే సంగ్రామ యాత్ర సమరయాత్రగా మారుతుందని ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ హెచ్చరించారు. విజయనగరం జిల్లా విద్యారంగ అభివృద్ధికై ఎస్.ఎఫ్.ఐ చేపట్టిన సైకిల్ యాత్ర రెండో రోజు మంగళవారం ఎస్.కోట శివారు పుణ్యగిరి కాలేజీ నుంచి ర్యాలీని రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ ప్రారంభించారు. అనంతరం దేవీ జంక్షన్ వద్ద ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్య వక్తగా పాల్గొన్న ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డికి బటన్ నొక్కడంపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంపై లేదన్నారు. సంక్షేమ హాస్టల్స్ లో విద్యార్థులు పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. వెంటనే సంక్షేమ హాస్టల్స్ లో విద్యార్థులకు చాలీ చాలని భోజనం పెడుతున్నారని విమర్శించారు. కాబట్టి పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచి, వారి ఆకలి తీర్చాలని డిమాండ్ చేశారు. మరోపక్క ప్రభుత్వ విద్యా విధానాన్ని విద్యార్థులకు దూరం చేసే విధంగా జగన్మోహన్ రెడ్డి మోదీ మీద ప్రేమతో నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారని దీని వలన రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు సీహెచ్.వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారని, దానిలో భాగంగా జీవో 77 తీసుకొచ్చి మొత్తం ఉన్నత విద్యకు మంగళం పాడేసారని అన్నారు. డిగ్రీలో విద్యార్థులకు ఇంటర్నషిప్ విధానాన్ని విద్యార్థుల స్థాయికి, సిలబస్ కి అనుగుణంగా పెట్టాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వ జూని యర్, డిగ్రీ కాలేజీలకు సొంత భవనాలను నిర్మించి, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఈ జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్నాం, అన్ని ప్రాంతాల్లో ప్రజలంతా ఆదరిస్తావున్నారని స్పష్టం చేశారు. జిల్లాలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షాన సంగ్రామ యాత్ర కాస్తా సమర యాత్రగా మారుతుందని జగన్మోహన్ రెడ్డికి చాలెంజ్ చేశారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారం కోసం పాలకులు, అధికారులు కృషి చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన

విశాలాంధ్ర - గజపతినగరం : గజపతినగరంలో ఓటర్ జాబితా పై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను విజయనగరం ఆర్డీవో ఎంవీ సూర్యకళ మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఉన్న ఓటర్లను తొలగించకుండా లేని వారి పేర్లను అన్ని పార్టీల సమక్షంలో తొలగించాలని కొత్తగా చేర్పులు చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అరుణ కుమారి ఎన్నికల డిటి సతీష్ బిఎల్వో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర - బెలగాం : మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన మంగళ వారం ఉదయం జరిగింది. పార్వతీపురం జిల్లా ఆసు పత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరఘట్టం మండల కేంద్రం బోయిడి వీధికి చెందిన అంటిపేట లక్ష్మి వ్యవసాయ కూలి. మంగళవారం ఉదయం ఎంకమ్మ చెరువు సమీపంలో సంతోషమ్మ గుడి దగ్గర పాలకొండ వైపు మెయిన్ రోడ్డుకు ఆనుకోని ఉన్న పొలంలో వుడుపుకు నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వీరఘటం నుండి పాలకొండ వైపు మోటార్ సైకిల్పై వెళ్తున్న వీరఘట్టం గ్రామం రెల్లివీధికి చెందిన బండి షాజన్ అనే యువకుడు వెనుక నుండి బలంగా ఢీకొనడంతో తుళ్లి రోడ్డుపై పడింది. ఈసంఘటనలో లక్ష్మికి, షాజన్ కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వీరఘట్టం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్ళగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారిణిలు హారిక, మౌనికలు ఎంపిక

విశాలాంధ్ర - శృంగవరపుకోట : శృంగవరపుకోట ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో శిక్షణ పొందుతున్న ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన క్రీడాకారిణిలు భరణికాన హారిక, వంపాన మౌనికలు ఈనెల 3వ తేదీ నుండి 6వ తేదీ వరకు వై.ఎస్.ఆర్ కడప జిల్లాలో జరగబోవు రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగంలో జిల్లా టీముకు ప్రాతినిధ్యం వహిస్తారని ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. వీరు ఈనెల 8, 9 తేదీల్లో విజయనగరం రాజీవ్ గాంధీ స్టేడియంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి చాంపియన్షిప్స్ కం సెలక్షన్స్ లో సింగిల్స్ లో హారిక ప్రదమస్తానం, మౌనిక ద్వితీయ స్థానం సాధించారు. డబుల్స్ లో హారిక / మౌనిక లు ప్రథమ స్థానం సాధించి జిల్లా చాంపియన్లుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు శ్రీరాములు తెలిపారు వీరిని ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు, శృంగవరపుకోట ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుకూరి రఘురాజు ఆయన నివాసంలో మంగళ వారం అభినందనలు తెలియజేస్తూ రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి జిల్లాకు శృంగవరపుకోటకు మంచి పేరు తేవాలనీ, వారు కడప వెళ్లి రావడానికి అయ్యే రవాణా ఖర్చులకు 5000 వేల రూపాయలు అందించారు. ఎంపికైన క్రీడాకారులను ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.వి. సత్యశేఖర్, స్నేహ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఏ.ఎస్.వెంకట్రావు ఆనల రమేష్, ఆనల మోహన్, కోచ్ ఎం.డి.అస్లా%శీ%లు అభినందనలు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - పార్వతీపురం : మండలంలోని సంగం వలస గ్రామంలో మంగళ వారం ప్రకృతి వ్యవ సాయ వనరులు విస్తరణ మరియు శిక్షణకేంద్రంను జిల్లా ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ సభ్యులు మంతిని మానస, దేవిప్రసాద్లు ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ వనరుల విస్తరణ మరియు రైతులకు శిక్షణా కేంద్రంగా పనిచేస్తుందని, ఈవనరుల కేంద్రంలో రైతులకు అన్ని రకాల చీడ పీడలకు, తెగుళ్ల నివారణకు సంబంధించిన కషాయాలు, పంట పెరుగుదలకు సంబంధించిన ద్రావ నాలు అందుబాటులో ఉంటా యన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించాలని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో యూనిట్ ఇంచార్జి గంట తవుడు ఐసిఆర్పీలు తేలు శంకరరావు, పెద్దింటి వెంకట నాయుడు రైతులు పాల్గొన్నారు.

కాలం రాజుపేటలో సామాజిక పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - గజపతినగరం : గజపతినగరం మండలం కాలం రాజుపేట గ్రామంలో మంగళవారం ఉదయం గ్రామ సర్పంచ్ గేదెల ఈశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో వాలంటీర్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణంలో వైసీపీ ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర - గజపతినగరం : ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజె క్టులు నిర్మించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని గజపతి నగరం మాజీ శాసనసభ్యులు నియోజక వర్గ ఇన్చార్జ్ డాక్టర్ కేఏ నాయుడు ఆరోపించారు మంగళ వారం గజపతి నగరంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో 2014 నుండి 2019 సంవత్సరంలో చంద్రబాబు హయాంలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టుల పై 21.445 కోట్లు ఖర్చుపెట్టగా ప్రస్తుత వైసిపి ప్రభుత్వం 4445 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందని అన్నారు కంపేరిజీవ్ చేసుకుంటే గత ప్రభుత్వం ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో తెలుస్తుందని అలాగే నాగావళి వంశధార చంపావతి గోస్తని నదులు వైఫల్యం నేటికీ ఎలా ఉన్నాయని ఉత్తరాంధ్ర సుజల ప్రవంతి పాత విజయనగరం జిల్లా లో ఎనిమిది లక్షల ఎకరాలకు పంట పొలాలకు నీరు ఇచ్చే కార్యక్రమం చేపట్టామని ముఖ్యంగా నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర సుజల ప్రవంతికి రెండు పంటల్లో సస్యశ్యామలం అయిందని అన్నారు ఈరోజు దృశ్యం చూస్తుంటే ఎక్కడ లేదని అన్నారు బ్రాంచ్ కెనాల్ 13 ఎకరాలకు మీరు ఇస్తామని చెప్పి గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా నేను ఉన్నప్పుడు ల్యాండ్ ఎక్విుపైజేషన్ చేసి పనులు కదిలించడం జరిగిందని ఐదు సంవత్సరాల శాసనసభ్యులుగా ఉన్న అప్పల నరసయ్య ఏం చేశారని ప్రభుత్వం మారి ఈ నాలుగు సంవత్సరాల నాలుగు నెలల లో ఎక్కడ రైతు అభివృద్ధి కి ఊక దంపుడు ఉపన్యాసాలు తప్ప ఏం చేశారో చెప్పాలని బడ్జెట్ ఇచ్చిన వి పేపర్లకే పరిమితి అవుతున్నాయని తెలిపారు ఈ సమావేశంలో పత్రికా ముఖంగా డిమాండ్ చేస్తున్నామని తెలిపారు నియోజకవర్గంలోని రైతాంగానికి ఏమి సమాధానం చెప్పాలి ప్రజలు ఆర్థికంగా నష్టపోయారని సర్వనాశనం అయ్యారని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి వి వి గోపాల్ రాజు రాంజీ రాజు మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మీనాయుడు మాజీ జడ్పిటిసి సభ్యులు బండారు బాలాజీ లంక బంగారు నాయుడు కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు

ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమంపై డిప్యూటీ కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమంపై రాజకీయ పార్టీల నేతలతో స్పెషల్ డి ప్యూటీ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన దొర మంగళ వారం సమీక్ష నిర్వహించారు. ఎస్.కోట తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో ఎటువంటి తప్పులున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇచ్చి సరి చేయించాలని సూచించారు. తప్పులు లేకుండా ప్రతి ఒక్క అసలైన ఓటరుకి ఓటు హక్కు కల్పించడమే తమ బాధ్యత అని గుర్తు చేశారు. నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఓటరు జాబితా సర్వే కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని సూచించారు. ఈ సమీక్షలో వైఎస్సార్సీపీ నేత వాకాడ రాంబాబు, సీపీఐ నేత మోపాడ మధు, ఆప్ జిల్లా నేత రాజు, బీజేపీ నేత డి.సూర్యారావు, కాంగ్రెస్ పార్టీ నేత పదాల మణిబాబు, టీడీపీ నుండి జీఎస్ నాయుడు, ఎస్.కోట, వేపాడ మండలాల ఎన్నికల సూపర్వైజర్లు, సిబ్బంది, ఎన్నికల డీటీ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపు ణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా పార్వతీ పురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పార్వతీపురంలోని స్థానిక శ్రీ సాయిరాం డిగ్రీ కాలేజీ ఆవరణంలో మినీ జాబ్ మేళ నిర్వహించారు. ఈ మినీ జాబ్ మేళ కి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, సింజరేస్ కాస్టింగ్ లిమిటెడ్, నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ ఈ జాబు డ్రైవ్ కు సుమారు 116 మంది ఇంట ర్వ్యూలకు హాజరుకాగా అందులో 45 మంది ఈ మూడు కంపెనీలలో ఎంపికయ్యారు. శ్రీ సాయిరాం డిగ్రీ కాలేజీ కార్స్పాండెంట్ శ్రీ పెంట అప్పారావు మాట్లా డుతూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఇది మొదటి సారనిఇలాంటి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యా భివృద్ధి సంస్థ వారి సహ కారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యూ.సాయికుమార్ గారు మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలని నిరుద్యోగా యువత అంది పుచ్చుకుని ఉన్నతా శిఖరాలు అదిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఎగ్జిక్యూటివ్ రెడ్డి మనోజ్ కుమార్, ఏపీ ఎస్-ఎస్డిసి సిబ్బంది పాల్గొన్నారు.

తమ డిమాండ్లను పరిష్కరించాలని ఎల్ఐసీ ఉద్యోగులు నిరసన

విశాలాంధ్ర - శృంగవరపుకోట : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, క్లాస్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ జాయింట్ ఫ్రెంట్ ఆధ్వర్యంలో మంగళవారం భోజన విరామ సమయంలో ఎస్.కోట ఎల్ఐసీ కార్యా లయం గేటు ఎదురుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ఫ్యామిలీ పెన్షన్ 15% నుండి 30% పెంపు చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఎన్పీఎస్ పెన్షన్ ఉద్యోగులకు మేనేజ్మెంట్ కంట్రిబ్యూషన్ 14% పెంపుకోరుతూ ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్ మిత్రులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ సమర్పణ

విశాలాంధ్ర - విజయ నగరం టౌన్ : వినియో గదారులకు సేవల ందించ్డమే కాకుండా సమాజానికి ఉపయోగపడే అనేక సామాజిక సేవాకార్యక్రమంలు చేపడుతున్నట్లు కరూర్ వైశ్య బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నేరళ్ల రమేష్ తెలిపారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవాలయం ఆవరణలో వాటర్ కూలర్ను ప్రారంభోత్సవం చేశారు. వాసవీ క్లబ్ మరియు కరూర్ వైశ్య బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో వాటర్ కూలర్ ఏర్పాటు చేసినట్లు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ ఆత్మకూరి సతీష్ తెలియజేశారు. సంఘం అధ్యక్షులు కందుల సంతోష్ మాట్లాడుతూ క్లబ్ ద్వారా పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సముద్రాల నాగరాజు, కోశాధికారి ఏ.వి.ఎస్.కుమార్,క్యాబినెట్ సెక్రటరీ జగన్మోహన రావు, కుసుమంచి వెంకటరావు, గుంపిన ఇందిర, అడ్డా నరసింగరావు, రీజియన్ చైర్మన్ ఆలవెల్లి శేఖర్, నారాయణరావు, ఏ.వి.కృష్ణారావు, వనిత విజయం కార్యదర్శి స్నేహ, కోశాధికారి నేతి అరుణ పాల్గొన్నారు.

నగదు రహిత లవాదేవిలపై కండక్టర్లకు అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : మంగళ వారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రజా రవాణా అధికారి ఆధ్వ ర్యంలో కండక్టర్స్ మరియు డ్రైవర్స్కు టిం మెషిన్ ద్వారా నగదు రహిత లవాదేవిలపై అవగాహన కల్పించడం జరిగినది. అదే విధంగా ప్రయా ణికులు ఫోన్ పే , గూగుల్పే, పేటీఎం తదితర క్యూఆర్ కోడ్ ద్వారా పేమెంట్ చేయొచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పల నారాయణ, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజరు ఆది నారాయణ మరియు రీజినల్ కోర్ గ్రూప్ సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా ఎంఈఓల సంఘం జిల్లా నూతన అధ్యక్షునిగా సామల

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా మండల విద్యాశాఖాధికారుల సంఘం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఈఓల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులుగా జె.నారాయణ స్వామి, జిల్లా అధ్యక్షునిగా సామల సింహాచలం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్. నాగభూషణరావు, కోశాధికారిగా ముద్దల వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కర్రి ప్రసాదరావు, ఎం. శ్రీనివాసరావు, ఆర్. ఆనందరావు, పి.జోగారావు, కె. సోంబాబు, పి.సత్య నారాయణ,మహిళా ప్రతినిధులుగా వై.విమలకుమారి, సూరి దేముడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బి.చంద్రశేఖర్, ఎ.శ్రీనివాస రావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షులు సామల సింహాచలం మాట్లాడుతూ ఎంఈఓల వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పాఠశాలలను విద్యారంగంలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని చెప్పారు.

పకడ్బందీగా డిపార్ట్మెంటల్ పరీక్షలు : జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు

విశాలాంధ్ర - విజయనగరం : ఈ నెల 2 నుంచి ప్రారంభం కానున్న డిపార్ట్ మెంటల్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, వివిధ శాఖల అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై తన ఛాంబర్లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ, అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించి, పరీక్షలను విజయవంతంగా నిర్వ హించాలని, అభ్యర్థులకు ఎటువంటి లోటు పాట్లు రాకుండా చూడాలని కోరారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని, త్రాగునీటిని అందు బాటులో ఉంచాలని, ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎపిపిఎస్సి సెక్షన్ ఆఫీసర్ పి.ఢిల్లీశ్వరరావు మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణ విధివిధానాలను వివరించారు. ఈ పరీక్షలు ఎపిపిఎస్సి ఆధ్వర్యంలో ఈనెల 2 వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఆరు రోజుల పాటు, స్థానిక సీతం కళాశాలలో జరుగుతాయని చెప్పారు. ఆబ్జెక్టివ్ పరీక్ష ఉదయం 10 గంటలు నుంచి 12 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు జరుగుతుందని, డిస్క్రిప్టివ్ పరీక్ష పరీక్ష ఉదయం 10 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటలు వరకు జరుగు తుందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు పరిక్ష రాసేందుకు ఆబ్జెక్టివ్ పరీక్షకు అదనంగా 40 నిమిషాలు, డిస్క్రిప్టివ్ పరీక్షకు 50 నిమిషాలు ఇవ్వాలని, స్క్రయిబ్లను అనుమతించాలని చెప్పారు. వీలైనంత వరకు గర్భిణులను క్రింద అంతస్తులోనే పరీక్ష రాయించాలని సూచించారు. పరీక్ష నిర్వహించిన తరువాత, జవాబు పత్రాల ప్యాకింగ్లో తగిన జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ సూపరింటిండెంట్ దేవ్ ప్రసాద్, సిఐ గోపాలనాయుడు, ఎలక్ట్రికల్ డిఇ ధర్మరాజు, ఎపిపిఎస్సి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ జె.చంద్రరావు, వివిధ శాఖల ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.కోటలో త్వరలోనే 'అన్న క్యాంటిన్' ప్రారంభం

మాజీ ఎమ్మెల్యే కోళ్ల, రాష్ట్ర కార్యదర్శి రాంప్రసాద్ వెల్లడి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు త్వరలోనే ఎన్టీఆర్ అన్న క్యాంటిన్ను ఎస్.కోట పట్టణంలో ప్రారంభిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ వెల్లడించారు. ఎస్.కోట తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా అన్న క్యాంటీన్ ఏర్పాటు పనులను మాజీ ఎమ్మెల్యే, నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక అన్న క్యాంటీన్లను తీసివేసిందని ఆరోపించారు. తిరిగి అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేద, మధ్యతరగతి ప్రజలకు అతి తక్కువ ధరకు భోజనాలు పెట్టి వారి ఆకలి తీర్చాలనే సదుద్దేశంతోనే అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శృంగవరపుకోట మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్.నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, మాజీ ఎంపీటీసీ గన్ను బంగారమ్మ, ఎస్.కోట పట్టణ పార్టీ అధ్యక్షులు కోనదం మల్లేశ్వరరావు, గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, రాష్ట్ర ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి చీపురుపల్లి సాగర్ కళ్యాణ్, విశాఖ టీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శులు కాపుగంటి శ్రీనివాసు, నియోజకవర్గ ఐటీడీపీ కార్యదర్శి అనకాపల్లి చెల్లయ్య, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు వాకాడ బాలు, కొత్తవలస మండలం టీడీపీ సీనియర్ నాయకులు లాలం అర్జునరావు, వెలమ కార్పోరేషన్ డైరెక్టర్ కొట్టాన విజయ్ కుమార్, వార్డు మెంబెర్ యలమంచిలి అక్కునాయుడు, దోమ సన్యాసిరావు మాస్టర్, యువత పెదగాడ రాజు, పందు, నిరుజోగి అమ్మతల్లినాయుడు, అక్కిరెడ్డి వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య అంశాలపై సమీక్ష

విశాలాంధ్ర - తెర్లాం : పరిషత్ కార్యాలయంలో మధ్య స్థాయి ఆరోగ్య ప్రదాతలు (ఎమ్.ఎల్.హెచ్.పి), ఏ.ఎన్.ఎమ్ .లతో రక్త హీనత, ప్రెగ్నెంట్ మహిళలు, ఆరోగ్య వృద్ధి హీనత, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, ఫీవర్ సర్వే, నులిపురుగుల నివారణ, మేరా మట్టి మేరా దేశ్ (నా మట్టి నా దేశం)లి కార్యక్రమం తదితర అంశములపై సమీక్షను నిర్వహించి పలు సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్.ఎల్.హెచ్.పి, ఏఎన్ఎమ్లు సమన్వయంతో పనిచేయాలని రక్త హీనత గల ప్రెగ్నెంట్ మహిళలు మరియు చిన్న పిల్లలను గుర్తించి వారు రక్తహీనత నుండి బయట పడదానికి సూచనలు సలహాలు ఇవ్వాలని అంగన్వాడీ కేంద్రములో సంతుష్టికరమైన పోషకాలు కలిగిన పదార్థాలు లభ్యం అవుతున్నాయని వాటిని వినియోగించుకోడానికి సూచనలు చేయాలని, రోగులు అందరూ మీయొద్దకు రాలేరు కావున సిబ్బంది గడప గడపకు వెళ్లి సర్వే చేసి ఎవరైనా రక్తహీనతతో బాధపడుతూ వున్నట్లతే వారికి విలువైన సూచనలు తీసుకోవలసిన ఆహార సమాచారం తెలియపరచి ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఫీవర్ సర్వే శతశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. మరియు ఆగస్టు 10వ తేదీన నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందని దానికి కావాల్సిన మందులు త్వరలోనే మన వద్దకు జిల్లా హెడ్ కేంద్రం నుండి చేరుతాయి కావున ప్రజలకు, పిల్లలకు అవగాహన కల్పించి కార్యక్రమం విజయవంతం జరిగేలా చర్యలను చేపట్టాలని, తేదీ ఆగస్టు 9 నుండి 15 తేదీ వరకు గౌరవ ప్రధానమంత్రి వారి సూచనల మేరకు మేరా మట్టి మేరా దేశ్ (నా మట్టి నా దేశం) అన్ని సచివాలయాల పరిధిలో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించబడతాయని వాటిలో తప్పక తప్పక పాల్గొవాలని, డెంగీ, మలేరియా కేసులు రాకుండా పంచాయతీ వ్యవస్థలను సంప్రదించి శానిటేషన్, మంచినీటి ట్యాంక్ లను క్లోరినేషన్ మరియు శానిటేషన్ జరిగేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి గారు, పెరుమాలి, తెర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో ఏజెంట్లు పాల్గొనాలి

టీడీపీ విశాఖ పార్లమెంటరీ మహిళా కార్యదర్శి మాకిరెడ్డి

విశాలాంధ్ర - జామి : ఓటర్ల జాబితాల పరిశీలనను స్థానిక బూత్ లెవెల్ అధికారులు పరిశీలన చేస్తున్నారని, ఈసమయంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఏజెంట్లు తప్పనిసరిగా పాల్గొనాలని విశాఖ పార్ల మెంటరీ టీడీపీ మహిళా కార్యదర్శి, జామి 10వ క్లస్టర్ ఇన్చార్జి మాకిరెడ్డి శ్రీలక్ష్మి సూచించారు. మంగళ వారం రామయ్యపాలెంలో జరుగుతున్న ఓటర్ల పరిశీ లనలో ఆమె స్వయంగా పాల్గొని బిఎల్వోలతోపాటు ఓట్లును తనిఖీ చేసారు. ప్రధానంగా మర ణించిన ఓటర్లు, రెండేసి ఓట్లు ఉన్న వారిని గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికలలో అధికార పార్టీ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడే అవకాశం ఉందని, ఓటర్ల జాబితాలలో అవకతవకలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ వెల్ఫేర్ అసిస్టెంట్లు మాత్రమే విధులుకు హాజరు

విశాలాంధ్ర - మెరకముడిదాం : ప్రజల ముంగిటికే సేవలు, సంక్షేమ పథకాలు అందించాలన్న ఆలోచనతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. సుమారుగా నాలుగేళ్ళు కావస్తుంది. మండలంలో 15 సచివాలయాలలును మం జూరు చేశారు. 15 సచి వాలయాల్లో కొండలావేరు సచివాలయం ఒక్కటే, ఇక్కడ సిబ్బంది ఎప్పుడు వస్తారో? ఎప్పుడు వెళ్ళి పోతారో? తెలియని పరిస్థితి? అంతేకాకుండా మండలానికి చివర సచివాలయం అయినందు వలన అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఇక్కడ సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నట్టు తెలుస్తుంది. మంగళవారం నాడు విశాలాంధ్ర సచివాలయం మను మూడు గంటలకు పరిశీలించగా వెల్ఫేర్ అసిస్టెంట్ రామకృష్ణ అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటరమణ మాత్రమే విధులను నిర్వహిస్తున్నారు.. మిగతా సిబ్బంది ఎటు వెళ్లారని వెల్ఫేర్ అసిస్టెంట్ రామకృష్ణను ప్రశ్నించగా తనకు తెలియదని బదులిచ్చారు. సిబ్బంది విధులకు దుమ్మా కొట్టడంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు గంటలకు నిరీక్షించవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇంతకీ ఈ సెలవులో ఉన్నారో?లేక విధులుకు దుమ్మా కొట్టారో? తెలియాల్సి ఉంది. వీఆర్ఓకు బదులు ఓ ప్రైవేటు వ్యక్తి విధులకు హాజరుకావటం కనిపిస్తుంది. వీఆర్వోకు బదులు కామేష్ అని ప్రైవేట్ వ్యక్తి అనధికారికంగా సచివాలయంలో విధులు నిర్వహించడం జరుగుతుందని తెలుస్తుంది. ఈ విధంగా విధులు నిర్వహించిన పట్టించు కున్న నాథుడు కరువయ్యాడు. మిగతా సిబ్బంది వెటర్నరీ అసిస్టెంట్,వి ఆర్ఓ, హార్టికల్చర్ కార్యదర్శి మహిళా పోలీస్ హెల్త్ డిపార్మెంట్ ఎంఎస్ఓ తదితరులు ఎక్కడికి వెళ్లారో తెలియల్సి ఉంది. సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఈ ఒక్కరోజు విధులకు దుమ్మా కొట్టారా? లేక రోజు ఇదే పరిస్థితి అన్నది తెలియాల్సి ఉంది. సిబ్బంది ఇష్టానుసారంగా విధులకు హాజరు కావడానికి అధి కారులు పర్యవేక్షణ లోపం కారణంగా చెప్పవచ్చు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది పనితీరును పరిశీలిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే పలు వురు బహిరంగంగా అంటున్నారు. ఎంపిడిఓ వివరణ: బి.రత్నం ను విశాలాంధ్ర వివరణ కోరగా కార్యదర్శి, మహిళా పోలీసును విధులు నుండి రిలీవ్ చేయడం జరిగిందని. మిగతా సిబ్బంది ఉండవలసి ఉందని తెలిపారు. విధులకు హాజరు కాని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది వివరణ ఇచ్చారు.

బదిలీలు జరిగి మూడు నెలలు గడిచినా వేతనాలు అందక ఉపాధ్యాయుల ఇక్కట్లు

విశాలాంధ్ర - పార్వతీపురం : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు జరిగి మూడు నెలలు గడిచిన ఇంతవరకు వారికి జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు జిల్లా పిఆర్టియు అధ్యక్షులు వోలేటి తవిటినాయుడు అన్నారు. జీతాలు అందక అగమ్య గోచరంగా ఉందన్నారు. ప్రతీ నెల ఒకటవతేదికి వేతనాలు అందక ఉపాధ్యాయుల ఆందోలనను అధికారులు అర్థం చేసుకోవాలన్నారు నేటికి బదిలీలు, పదోన్నతులు జరిగి మూడు నెలలు గడిచిన ఉపాధ్యాయుల సంగతి పట్టించుకోరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మణిపూర్ రాష్ట్ర మారణ హెూమంపై కరపత్రం విడుదల

విశాలాంధ్ర - బెలగాం : మణిపూర్ రాష్ట్ర మారణ హెూమం పైన సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళ వారం పార్వతీపురం సుందరయ్య భవనంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, వై. మన్మధరావు, వి. ఇందిర మాట్లాడుతూ మణిపూర్ లో కుకి తెగ ఆదివాసి గిరిజనులుగా జీవిస్తున్నారని, బిజెపి ప్రభుత్వం అభివృద్ధి చెందిన మెజార్టీ కులం అయిన మోయితే తెగను ఎస్టీ జాబితాలో చేర్చాలని నిర్ణయం తీసుకోవడంతో అక్కడ హింస చెలరేగిందని, కుకీ, నాగ తెగలను కొండలు నుండి తగిలేసి విలువైన అటవీ సంపద ఖనిజాలు గనులను కార్పొరేట్లకు అప్పచెప్పడంలో బాగమే బిజెపి ప్రభుత్వం, మైనింగ్ మాఫియాల కుట్రని అన్నారు. బిజెపి దేశ వ్యాప్తంగా తను అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళితులకు, గిరిజనులకు, ముస్లిం, క్రిష్టియన్ మతస్తులకు, మహిళలకు రక్షణ లేదన్నారు. ఇంత దుర్మార్గం జరుగుతున్న మన రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి వంత పాడటం తప్ప మణిపూర్ ఘటనను ఖండించడం లేదన్నారు. ఇప్పటికైనా మణిపూర్ హింసపై పార్లమెంటులో అన్ని పార్టీలతో చర్చించి హింసను కేంద్ర ప్రభుత్వం ఆపాలని, మహిళలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ఈ చర్యను ప్రజలంతా ఖండించాలని పిలుపు ఇచ్చారు.

పదకొండు వసంతాలు పూర్తి చేసుకున్న సీతం ఇంజనీరింగ్ కళాశాల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : తింటే గారెలే తినాలి వింటే భారతం వినాలి చదివితే సీతం కాలేజీలోనే చదవాలి అనే నానుడికి వత్తాసు పలుకుతూ పలువురు పత్రికా ప్రముఖులు చేసిన హర్షాతిరేకాల మధ్య సీతం పదకొండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంబరాలు జరుపుకున్నది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు ప్రసంగిస్తూ గత పదకొండు సంవత్సరాల వ్యవధి మరువలేనిదనీ, ఎన్నో ఆటు పోట్లు తట్టుకొని నిలబడగలగడం మరెన్నో విజయ బావుటాలను రెప రెప లాడుతూ చూడడం ఎంతో ఆనందదాయకమైన విషయమనీ, నాక్ గుర్తింపు పొందడం, జెఎన్‌టియు జివి తో శాశ్వత అనుబంధం పొందడం, యుజిసి ద్వారా 2(బి) గుర్తింపు పొందడం, అతి ప్రముఖమైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇసిఇ, కంప్యూటర్ కంపెనీలలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు సాధించడం గణనీయమైన విజ యాలను ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది సహాయ సహకారాలతో సాధించగలిగామనీ తన ఆనందాన్ని వెలిబుచ్చారు. గత పది సంవత్సరాల వ్యవధిలో రిసెర్చ్ రంగంలోనూ, కొత్త సాంకేతిక పద్ధతులలో బోధన సాగించడంలోనూ సీతం ముందు ఉంటోందని డీన్ రిసెర్చి డా. నరేంద్ర పేర్కొన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సీతం ఎల్లప్పుడూ పాటు పడుతూ ఉంటుందని సీతం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి అన్నారు. ఈ కళాశాల తో అనుబంధం కలిగి ఉండడం తనకెంతో ఆనందదాయకం అని ఈ సంస్థకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ ఉంటాననీ బాలల హక్కుల సంఘం అధ్యక్షులు కేసలి అప్పారావు హామీ ఇచ్చారు.

న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక భద్రతా చట్టం చేయాలి

విశాలాంధ్ర, శృంగవరపుకోట : న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక భద్రతా చట్టం తక్షణమే లోకసభ / రాజ్యసభల్లో బిల్లు ఆమోదించి చట్టం చేయకపోతే న్యాయవాద వృత్తి అంతరించుకు పోతుందని, న్యాయవాదులకు ఆత్మస్థైర్యం, నమ్మకం, భద్రతను ప్రభుత్వాలు కల్పించక పోతే శాంతి భద్రతల సమస్యలతో ఆటవికత పెచ్చురిల్లి పోతుందని ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి అల్లు సత్యాజీ, డబ్ల్యు.ఎన్.శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ బార్ అసోసియేషన్ కి చెందిన న్యాయవాది ఆర్.ఆదిశేష విఠల్ బాబు హత్యను ఖండిస్తూ ఎస్.కోట న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై తిరగబడే సమాజం ఏర్పడితే బాల్యం తప్ప యవ్వనం కనబడదని గ్రహించాలని సూచించారు. అన్ని ప్రజా సమస్యలకు, భాదితుల సమస్యలకు న్యాయవాదులు అండగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. న్యాయవాది రక్షింపబడితేనే సమాజం రక్షింప బడుతుందనే వాస్తవాన్ని పాలకులు గ్రహించ లేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బాగా స్థిరపడిన సుప్రీంకోర్టు, హైకోర్టు సీనియర్ న్యాయవాదులు ఈ తరం న్యాయవాదుల భద్రతకై ప్రత్యేక దృష్టి సారించి చారిత్రక స్థానం కైవసం చేసుకుని నేటి న్యాయవాద తరానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. న్యాయవాది పాత్ర లేకుండా పాలనా వ్యవస్థ లేదనేది ఎంత వాస్తవమో.. న్యాయవాదులకు ప్రత్యేక భద్రతా చట్ట సౌకర్యం కల్పించాలనేది అంతే వాస్తవం అని పాలకులు గ్రహించాలని హితవుపలికారు. ఇప్పటికైనా న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక భద్రతా చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, కార్యదర్శి డబ్ల్యు.ఎన్.శర్మ, న్యాయవాదులు బి.త్రిమూర్తులు, వారాది ఈశ్వరరావు, బీవీఎస్ రామారావు, బి.సత్యనారాయణ, బోని శేఖర్, జి.చిట్టిబాబు, పిడిది రామకృష్ణ, బి.వెంకటరావు, బొబ్బిలి రామకృష్ణ, ఆర్.సత్యనారాయణ, ఎం.అనూరాధ పాల్గొన్నారు.

మాతా, శిశు ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నిర్వహించాలి

విశాలాంధ్ర - బెలగాం : మాతా, శిశు ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నిర్వహించి, వారి ఆరోగ్య శ్రేయస్సుకై కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. జిల్లా ఆసుపత్రిలో ఉన్న పిపి యూనిట్ లో పట్టణ పరిధిలో ఉన్న ఆరోగ్య సిబ్బందికి వైద్యాధికారి డాక్టర్ వై. విజయమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమాన్ని మంగళ వారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ గర్భిణీలకు, శిశువులకు ఆశా కార్యకర్తలు అందజేసిన వైద్య సేవలను ఎప్పటికప్పుడు ఇ - ఆశా యాప్ లో నమోదు చేయాలన్నారు. ఇందులో ముఖ్యంగా గర్భిణీలను త్వరగా గుర్తించడం, ఆశా వద్ద గర్భ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచడం, నవజాత శిశువుల గృహ సందర్శనలో పరిశీలించిన ఆరోగ్య వివరాలు, పిల్లలకు ఇచ్చే ఐరన్, విటమిన్ ఎ ద్రావణాలు, అదేవిధంగా ప్రతి నెలా పట్టణ ఆరోగ్య పారిశుధ్య పోషకాహార కమిటీలు, కార్యక్రమాలు నిర్వహించడం తదితర వాటిని విధిగా నిర్వహించి వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ నెల మొదటి వారం తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా బిడ్డకు తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించడం తద్వారా బిడ్డ ఎదుగుదలకు వీటి ప్రాముఖ్యతను వివరించాలన్నారు. అదేవిధంగా ఈ నెల 7వ తేదీ నుండి 12వ తేదీ మధ్యలో నిర్వహించబోయే మిషన్ ఇంద్ర ధనుష్ ప్రోగ్రాంకు సర్వేలో గుర్తించిన టీకా అర్హులు అందరినీ కొత్తగా చేర్చబడిన యూవిన్ పోర్టల్ లో నమోదును వైద్య సిబ్బంది త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా లెప్రసీ సర్వే, ఎన్సిడి సర్వే, ఫీవర్ సర్వే తదితర కార్యక్రమాలపై దృష్టి సారించి పూర్తి స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందజేసి నివేదికల పురోగతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి. లావణ్య, సూపర్ వైజర్లు బి. పుష్ప, జయగౌడ్, స్టాఫ్ భారతి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమానికి సహకరించాలి : పార్వతీపురం ఆర్డీఓ

విశాలాంధ్ర - పార్వతీపురం : ఓటరు నమోదు కార్యక్రమానికి రాజకీయ పార్టీలు సహకరించాలని పార్వతీపురం ఓటరు నమోదు అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత అన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇంటింటికి ఓటరు ధృవీకరణ కార్యక్రమం జూలై 21 నుండి జరుగుతుందని తెలిపారు. 10 కంటే ఎక్కువ ఫారాలను బి.ఎల్.ఓకు సమర్పించకూడదనే షరతులకు లోబడి భారత ఎన్నికల సంఘం బూత్ లెవల్ ఏజెంట్లను అనుమతించిందని ఆమె చెప్పారు. బూత్ లెవల్ ఏజెంట్లు సమర్పించిన దరఖాస్తులు అన్నింటికీ ధృవీకరణ పత్రాలను సమర్పించాలని స్పష్టం చేశారు. డూప్లికేట్ ఎంట్రీలు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్ళిన ఓటర్ల వివరాలు పరిశీలన, ఓటర్ల జాబితాలో సవరణలు ఉంటే వాటిని గుర్తించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. చిరునామాను మార్చుకున్న ఓటర్ల వివరాలు, డోర్ నంబర్ అడ్రస్ వెరిఫికేషన్ (10 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లు) చేస్తారని చెప్పారు. ఇంటి నెంబర్లకు సంబంధించిన ఎంట్రీల సవరణ కోసం ఫారం-8 సేకరించడం జరుగుతుందని ఆమె వివరించారు. 2023 జూలై 21 నుండి ఆగస్టు 21వరకు బూత్ స్థాయి అధికారులతో ఇంటింటా ఓటరు వివరాల విచారణ జరుగుతుందన్నారు. ఆగస్టు 22 నుండి సెప్టెంబరు 29 వరకు ఓటరు కార్డుపై ఫోటో మిస్ మేచింగ్, క్లారిటీ లేకపోవడం, పోలింగ్ కేంద్రాల మార్పు వంటి అంశాలను పరిశీలించడం జరుగుతుందని ఆమె వివరించారు. సమగ్ర ముసాయిదా జాబిత సెప్టెంబరు 30 నుండి అక్టోబరు 16వరకు జరుగుతుందని చెప్పారు. ముసాయిదా జాబిత అక్టోబరు 27న ప్రచురించడం జరుగుతుందని, అక్టోబరు 17 నుండి నవంబరు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్లు సమర్పించవచ్చని ఆమె అన్నారు. అభ్యంతరాలు, క్లెయిమ్లు డిసెంబరు 26 నాటికి పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు.

ఉత్తమ అధికారిగా సంగమేష్

విశాలాంధ్ర - గుర్ల : వ్యవసాయ విభాగంలో రైతులందరికీ అందు బాటులో ఉంటూ. ప్రభుత్వ సేవలను రైతులకు సకాలంలో అందిస్తున్న గుర్ల మండలంలోని. పాలవలస గ్రామ వ్యవసాయ అసిస్టెంట్. బి. సంగమేష్ జిల్లాలో ఉత్తమ గ్రామ వ్యవసాయ అధికారిగా. ఎంపిక అయ్యారని. మండల వ్యవసాయ అధికారి తిరుపతిరావు మంగళవారం తెలిపారు. జిల్లాలోని ఉత్తమ అధికారిగా ఎంపికైన సంగమేష్ కు సహకార వ్యవసాయ అధికారులు అభినందనలు తెలిపారు.

మాజీ జెడ్పీటీసీ నిమ్మల నిబ్రం జనసేనలో చేరిక

విశాలాంధ్ర - పాలకొండ : పాలకొండ నియోజకవర్గానికి చెందిన మాజీ జెడ్పటీసీ,గిరిజన నాయకులు నిమ్మల నిబ్రం తనఅనుచరులతో కలిసి జనసేన పార్టీ లో చేరారు. జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆయనకు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పాలకొండ నియోజకవర్గంలో జనసేన పార్టీ తరుపున పార్టీ కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తానని, పార్టీ ఆదేశాలు మేరకు కష్టపడి పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తానని చెప్పారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే
ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - వేపాడ : నాడు ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ కే దక్కుతుందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కడపండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జాకేరు సచివాలయం పరిధిలోని గుడివాడ గ్రామంలో 239వరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఈ నాలుగేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు వైసిపి ప్రభుత్వం వచ్చాక కలిగే మేలును వారికి వివరించి ప్రభుత్వ పనితీరు గురించి వారిని అడగగా తమకు జగన్ ప్రభుత్వం వచ్చాక చాలా మేలు జరుగుతుందని ఎమ్మెల్యేకు తెలుపగా వారి వద్దనుంచి ఆశీర్వాదములు తీసుకున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మళ్లీ జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి లబ్ధిదారుల తలుపు తట్టి వారినీ ఆప్యాయంగా పలకరించి మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కాలంలో అందిస్తున్న సంక్షేమ ఫలాలను నేరుగా వారికి వివరించి వారు పొందుతున్న లబ్ధిని గుర్తుచేస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వచ్చాక తమ ఇంటి పెద్ద కొడుకుగా,కన్న కొడుకుగా, పెద్ద అన్నగా మీ అందరినీ సాకుతున్నారని, మీకు అండగా నిలుస్తున్నారు అని తెలుపుతూ మీ అందరి ఆశీర్వాదాలు మన సీఎం జగన్ పై మన వైసీపీ ప్రభుత్వం పై ఎల్లవేళలా ఉండాలని, మంచి మనసుతో దీవించాలని శాసనసభ్యులు వారిని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు,పంచాయతీరాజ్ జోనల్ ఇంచార్జ్ మెరపల సత్యనారాయణ,మండల పార్టీ అధ్యక్షుడు ముమ్ములూరు జగన్నాథం, నెడ్ కేప్ డైరెక్టర్ చలుమూరి పద్మావతి,వైస్ ఎంపీపీ అడపా ఈశ్వర రావు,సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, కోపరేటివ్ మాజీ అధ్యక్షులు గండి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నగదు విషయమై వాగ్వాదం కారణంగానే లాడ్జిలో మహిళ హత్య
- నిందితుడి నుండి పల్సర్ బైకు, 61గ్రాముల బంగారం, నగదు లక్ష స్వాధీనం
- మహిళను హత్య చేసి ముత్తూట్ ఫైనాన్స్ లో బంగారం తాకట్టు
- నిందితుడు స్వగ్రామం అరకు మండలం ఉరుమల గ్రామం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట జూనియర్ కళాశాల మైదానం ఎదురుగా గల చందన్ లాడ్జీలో ఇటీవల జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం సాయంత్రం ఎస్.కోట పోలీసు స్టేషన్ ఆవరణలో డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ బాల సూర్యారావు, ఎస్.ఐ జె.తారకేశ్వరరావులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఈనెల 24న అరకు మండలం, ఉరుమల గ్రామానికి చెందిన మాదల శ్రీరాములు అనే వ్యక్తి తనకు తెలిసిన దేవరాపల్లి గ్రామానికి చెందిన ఆరిపాక ఈశ్వరమ్మతో కలిసి చందన్ లాడ్జీ గదిని బుక్ చేసుకున్నాడని తెలిపారు. అయితే వారిద్దరి మధ్య నగదు విషయంలో వాగ్వాదం జరగడంతో 26న ఆమె తలను గోడకు గుద్దించడంతో తీవ్ర రక్త గాయమైంది. దీంతో అతను భయపడి ఆమె చీరనే మెడకు బిగించి చంపేశాడన్నారు. చంపేసిన తర్వాత రోజు మళ్లీ వచ్చి ఆమె మెడలో, చేతులకు ఉన్న బంగారు గొలుసు, గాజులు, ఉంగరాలూ తీసుకుని ఎస్.కోటలోని ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టేశాడని చెప్పారు. తదుపరి మాదల శ్రీరాములు అద్దెకు తీసుకున్న గది నుంచి దుర్వాసన వస్తుండటంతో లాడ్జి మేనేజర్ గనివాడ శ్రీనివాసరావు ఈనెల 30న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్.ఐ, సీఐలు పరిశీలించి మహిళ హత్యకు గురైన విషయాన్ని గుర్తించి దర్యాప్తు చేయగా 01వ తేదీ మధ్యాహ్నం ఎస్.కోట కాంప్లెక్స్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈశ్వరమ్మను హత్య చేసిన విషయాన్ని అంగీకరించాడని తెలిపారు. నిందితుడి నుండి ఒక పల్సర్ బైకు, నాలుగు బంగారు గాజులు, రెండు ఉంగరాలు మొత్తం 61 గ్రాముల బంగారాన్ని, లక్ష నగదును, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని వివరించారు. కాగా నిందితుడు అరకు జనసేన పార్టీ నాయకుడిగా ఉన్నట్టు తెలిసిందని, పూర్తి విషయాలు రాబట్టాల్సి ఉందని డీఎస్పీ గోవింద రావు వివరించారు. నిందితుడిని పట్టుకున్న ఎస్.ఐ తారకేశ్వరరావు, సీఐ బాల సూర్యారావు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఆగస్టు3 మన్యం బంద్‌కి ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక మద్దతు

విశాలాంధ్ర - కురుపాం : మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దమన కాండ కు నిరసనగా ఆదివాసీ సంఘాలు పిలుపు మేరకు ఆగస్ట్ 3 న జరుగు రాష్ట్ర మన్యం బంద్ కు ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు అధ్యక్షుడు కోలక లక్ష్మణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ,గడిచిన నాలుగు నెలలుగా ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం అండ తో జాతులు,మతాల మధ్య చిచ్చు పెట్టి, అభివృద్ధి చెందిన కులమైన మైతీయి లను ఎస్టీ హెూదా కల్పిస్తూ నిర్ణయం చేయడం అక్కడ ఆదివాసీ లుగా ఉన్న కుకి, నాగలు దానికి వ్యతిరేకంగా నిరసన తెలిజేయడం దాన్నీ సహించ లేని బీజేపీ ముసుగు లో ఉన్న ఆర్ఎస్ఎస్ మూకలు పాశవికంగా దాడులు చేసి హత్యలు చేయడం మహిళలను నగ్నంగా ఊరేగించము, వెలుగు చూడని అనేక నిజాలు సోషల్ మీడియా ధ్వారా బయటకు రావడం తో జాతీయ మానవహక్కుల కమిషన్, సుప్రీం కోర్టు సుమోటోగా స్పందించిన తరువాత యావత్తు ప్రపంచ ము ఖండించిన తరువాత ప్రధాని ప్రకటన చేయాల్సి వచ్చింది. మానవ హక్కుల గూర్చి, ప్రజాస్వామ్యం గూర్చి విదేశాల్లో ఉపన్యాసాలు చేసే ప్రధాని పార్లమెంట్ లో విపక్షాలు డిమాండ్ చేస్తుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారు, నైతిక విలువలున్న మణి పూర్ ముఖ్యమంత్రి ఐతే భాద్యత వహించి పదవికి రాజీనామా చేయాలి,వీటన్నికి నిరసనగా. జరుగు మన్యం బంద్ కు ప్రజలంతా సహకరించాలని కోరు చున్నా ము.

మన్యం రహదారులు బాగుపడేది ఎప్పుడు : టీడీపీ ఇంఛార్జి నిమ్మక జయకృష్ణ

విశాలాంధ్ర - సీతంపేట : పాలకొండ నియోజకవర్గం సీతంపేట మన్యంలో అనేక మారుమూల రహదారులు గుంతలతో అధ్వనంగా తయార వడంతో గిరిజనులు రహదారి సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులకు గురవు తున్నారని ఈ నేపథ్యంలో కిట్టలపాడు నుండి కడగండి రోడ్డు పరిశీలించిన పాలకొండ నియోజకవర్గం ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ.గ్రామాల్లో రహదారులు గుంతల మయమై ప్రజా రవాణా ఇబ్బందులు పడుతున్న కనీసం పట్టించుకోని పరిస్థితులలో అధికార పార్టీ ఎమ్మెల్యే కళావతి ఉందన్నారు అదేవిధంగా మన్యం ప్రాంతంలో పూర్తి స్థాయిలో ఎత్తైన కొండ ప్రాంతాలకు రహదారి సౌకర్యాలు లేక గిరిజనులు అనారోగ్య సమస్యలు పాలవుతున్నప్పుడు అంబులెన్సులు కూడా వెళ్లక డోలిలే వారి ప్రాణాలకు రక్షించే విధంగా గిరిజనులు కష్టాలు పడుతున్నారని తెలిపారు ఎప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి గిరిజన ప్రాంతాల్లో పూలుస్తాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డిక చంద్రరావు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకం దారులకు రుణాల పట్ల హర్షం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : గొర్రెల పెంపకం దారుల రుణాల కోసం జిల్లా కు ఐదు కోట్లు రూపాయలు కేటాయించడం హర్షణీయమని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసరపు శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. మంగళ వారం జిల్లా వెటర్నరీ కేంద్రంలో గొర్రెల సహకార సంఘం జిల్లా చైర్మన్ మన్యాల కృష్ణ యాదవ్ కు ప్రత్యేక ఛాంబర్ ను కేటాయించినందుకు పట్నంలో ఉన్న యాదవులు కలిసి ఆయనకి సత్కరించారు. ఈసందర్భంగా శేఖర్ యాదవ్ మాట్లాడుతూ తమ సహకార సంఘానికి చాంబర్ కేటాయించిన జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామికి సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో గొర్రెల కాపరుల కోసం వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని 500 రైన్ కోట్లు, కాపర్లు మంద చేసుకోవడానికి టార్చ్ లైట్లు సబ్సిడీ మీద అందించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ కుల పోరాట సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రధమ స్థానం సంపాదించుకున్న కెల్ల సొసైటీ
85 వేల నుంచి 22 కోట్లకు పెరిగిన టర్న్ వర్

విశాలాంధ్ర - గుర్ల : సహకార సంఘాలు ప్రగతి పదంలో దూసుకుపోతున్నాయి. సాంప్రదాయగా రైతులకు ఎరువులు, విత్తనాలు సరఫరా, రుణాలు అందజేత మాత్రమే కాకుండా . వివిధ రకాల వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. అలాంటి వాటిలో ముందుంది కెల్ల సొసైటీ . ఒకప్పుడు రైతులకు మాత్రమే సేవలు అందించే ప్రాథమిక సహకార సంఘాలు. సామాన్యులకు అవసరమైన సేవలు సైతం అందిస్తున్నాయి గతంలో ఎరువులు, పురుగుల, మందులు అమ్మకాలకు మాత్రమే పరిమితమైన ఈ సహకార సంఘాలు. ఇప్పుడు మల్టీ సర్వీసుగా మారుతున్నాయి. ఇలా వినూతమైన కార్యక్రమాలు చేపడుతున్న కెల్ల సొసైటీ . జిల్లాలో ఉత్తమ సొసైటీగా అవార్డు ను కైవసం చేసుకుంది. ఈ అవార్డును ఈ నెల 4వ తేదీ విజయవాడలో సీఎం జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా అందుకోను న్నారు.

85 వేల నుంచి 22 కోట్లకు పెరిగిన టర్న్ వర్

కెల్ల సొసైటీ అధ్యక్షుడిగా కె.వి సూర్యనారాయణ రాజు (పులిరాజు) 1987 బాధ్యతలు స్వీకరించారు. అప్పట్లో. రూ.87 వేల వ్యాపారం ఉండేది. 2023 నాటికి రూ .22 కోట్ల 46 లక్షల వ్యాపారం అయ్యేలా అభివృద్ధి చేశారు. 1987 నుండి నేటి వరకు ఆయనే సొసైటీ అధ్యక్షునిగా ఉన్నారు. కెల్ల సొసైటీ సుమారు రూ.1.90 కోట్లు లాభాల్లో ఉంది. ఈ ఏడాది 2095 మంది రైతులకు. 6.78 లక్షలు డివిడెంట్లు అందజేయమన్నారు.

విద్యార్థులు చిన్ననాటి నుండే ఉన్నత ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : విద్యార్థులంతా చిన్ననాటి నుండే ఉన్నత ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ దీపికా పాటిల్ అన్నారు. మంగళవారం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఆదిత్య డిగ్రీ కళాశాల అచీవర్స్ డే కార్యక్రమాన్ని డైరెక్టర్ సుగుణ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీ దీపిక పాటిల్ మాట్లాడుతూ విద్యార్థులంతా చిన్ననాటి నుండి విద్యపై దృష్టి సారించి ఉన్నత ఫలితాలను సాధించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేయాలన్నారు. విద్యలో నిరంతరం అత్యుత్తమ ప్రదర్శన ఉండడంవల్ల రానున్న కాలంలో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి విషయాన్ని తేలికగా తీసుకోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటువంటి విజయాలు సాధించేందుకు నిరంతరం ఎంతైనా కృషి ఉందన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి నిరంతరం అభిప్రాయాలను తెలపడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విశిష్ట అతిథి బొత్స ఝాన్సీ లక్ష్మీ మాట్లాడుతూ వివిధ కార్పొరేట్ సంస్థల్లో 483 మంది విద్యార్థులు ఉద్యోగాలు సంపాదించడం ఎంతో అభినందనీయమన్నారు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన చేపడుతున్న ఆదిత్య విద్యా సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రానున్న కాలంలో మరెన్నో విజయాలు సాధించేందుకు ఆదిత్య కళాశాలల విద్యార్థులు ప్రయత్నించాలన్నారు. అనంతరం చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలను స్థాపించిన నాటి నుండి ఎంతోమంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూ రోజులు లేని విధంగా ప్రస్తుత సంవత్సరం 483 మంది విద్యార్థులు ఉన్నత కంపెనీలలో ఉద్యోగాలు పొందడం హర్షించదగ్గ విషయం అన్నారు. అనంతరం ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పివి గోపాలరాజు, కళాశాల ప్రిన్సిపల్ బి దామోదర్ తదితరులు పాల్గొన్నారు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలో నిర్మితమవుతున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీ రాముల నాయుడు ఆదేశించారు. ఈ మేరకు మంగళ వారం ఉదయం వీటి అగ్రహారంలో నిర్మాణ దశలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. త్వరలోనే ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవాలు జరుగునున్న నేపథ్యంలో ఆ సమ యాన్ని కల్లా పనులన్నీ పూర్తి కావాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి ఆదేశించారు. ఈ మధ్యనే గాజులరేగలో ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలోనే మరో రెండు ఆరోగ్య కేంద్రాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అలాగే మిగిలిన ఐదు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను పూర్తిచేసి ప్రరంబోత్సవాలకు సిద్ధం చేస్తామన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వీలైనంత తొందరగా ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈ ఈ కె శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ బాలి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్టీకమీషన్ చైర్మన్‌ను కలిసిన గౌరినాయుడు

విశాలాంధ్ర - జామి : రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్‌గా నియమితులైన డా. డివిజి శంకరరావును ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కొత్తలి గౌరినాయుడు మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అసందర్భంగా శంకరరావును బొకెతో అభినందించి రాష్ట్రంలో గిరిజనుల సమస్యలపై తగిన విదంగా స్పందించాలని కోరారు. గతంలో గిరిజన ప్రాంతాలలో ఎంపిగా ఎంతో అభివృద్ధి చేసిన విషయాలను గుర్తు చేసి మరింత అభివృద్ధి చేయాలని కోరారు. అందరి సహకారంతో గిరిజనులకు తగిన న్యాయం చేస్తానని శంకరరావు హామీ ఇచ్చారు.

ప్రజల సమక్షంలోనే తేల్చుకుందాం

విశాలాంధ్ర - చీపురుపల్లి : చీపురుపల్లి నియోజకవర్గ అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో ప్రజలందరికీ బాగా తెలుసునని తెదేపా నియోజకవర్గ నాయకులు పైల బలరాం, దన్నాన రామ చంద్రుడు, తాడ్డే సన్యాసి నాయుడు, సారేపాక సురేష్ అన్నారు. తమ అధినేత చంద్రబాబు ఈ ప్రాంతంపై ఉన్న అభిమానంతో.. నాడు నియోజకవర్గానికి ప్రాతి నిధ్యం వహించిన, అప్పటి మంత్రి కిమిడి మృణాళిని కృషితో అనేక ప్రాజెక్టులు మంజూర య్యాయని గుర్తు చేశారు. తమ కృషిని వారి గొప్పతనంగా పేర్కొనడం సిగ్గు చేటన్నారు. మంగళవారం చీపురుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిపై వైకాపా నాయకులు చేసిన సవాల్‌కు స్పందించారు.చర్చకు ఎక్కడైనా, ఎప్పుడైనా తాము సిద్ధమేనని... ప్రజల సమక్షంలోనే తేల్చుకుందామని స్పష్టం చేశారు. 2004 నుండి మంత్రి పదవులు అనుభవించిన బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గం కోసం ఏం చేశారని ప్రశ్నించారు. ఏళ్లుగా చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ సాధించలేక.. డివిజన్ రావాలంటే మున్సిపాలిటీ అయ్యి ఉండాలని నిబంధనలు చెప్పినది వైకాపా నాయకులు కాదా? అని నిలదీశారు.

'జగనన్న సురక్ష'విజయవంతం : జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర - విజయనగరం : ప్రజల సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే నాణ్యమైన పరిష్కారం చూపేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష ప్రత్యేక కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా సాగిందని, అనుకున్న దానికంటే విజయవంతంగా సాగి ప్రజా మన్ననలు పొందిందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ పేర్కొన్నారు. జూన్ 23న లాంఛనంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆగస్టు ఒకటో తారీఖుతో ముగిసిందని, రోజు విడిచి రోజు నెల రోజుల పాటు సాగిన జగనన్న సురక్ష క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ దశల్లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాలు ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించగలిగాయని హర్షం వ్యక్తం చేశారు. నెల రోజుల పాటు జిల్లాలో సాగిన జగనన్న సురక్ష శిబిరాల ద్వారా ఎన్నో ప్రజా సమస్యలు పరిష్కారానికి వచ్చాయని, క్యాంపులు సత్ఫలితాలను అందించాయని పేర్కొంటూ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

5.16 లక్షల కుటుంబాలను సందర్శించిన సేవకులు

ప్రత్యేక ప్రణాళికతో నెల రోజుల పాటు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు జిల్లాలోని 5,16,394 కుటుంబాలను సందర్శించారు. అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో ఉండే వివిధ కేటగిరీలకు చెందిన సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ క్రమంలో 4,89,714 టోకెన్లు నమోదు కాగా 4,74,420 ప్రజా వినతులకు శాశ్వత పరిష్కారం చూపారు. 111 కేటగిరీలకు సంబంధించిన సేవలను ఉచితంగా అందజేశారు. జిల్లాలో 6,27,168 కుటుంబాలు ఉండగా అందులో 5,16,394 కుటుంబాలను ప్రభుత్వ సేవకులు సందర్శించి నాణ్యమైన సేవలందించారు. 96.88 శాతం ఫలితాలను సాధించి ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లాల సరసన విజయనగరం నిలవటం హర్షణీయమని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

మిషన్ మోడ్‌లో ప్రత్యేక శిబిరాలు...

జిల్లా స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు ప్రతి ఒక్కరూ సరైన ప్రవర్తనా నియమావళి పాటిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ సురక్ష ప్రారంభంలో పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో అందరూ భాగస్వామ్యం కావాలని, ప్రజా సమస్యలను ముందుగానే గుర్తించి శిబిరం రోజు వాటికి సరైన పరిష్కారం చూపుతూ సంబంధిత ధృవ పత్రాలు మంజూరు చేయాలని సూచించారు. దీనికి గాను ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని 111 రకాల సేవలను మిషన్ మోడ్‌లో ప్రజలకు అందించాలని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ, వార్డు వాలంటీర్లు భాగస్వామ్యమై విజయవంతం కావటంలో కీలక పాత్ర పోషించారు.

దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం

రెవెన్యూ, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ, రిజిస్ట్రేషన్ స్టాంపులు, వ్యవసాయ, ఆధార్, పౌరసరఫరాలు, గ్రామ వార్డు సచివాలయాలు, గ్రామీణాభివృద్ధి, కార్మిక, వైద్య ఆరోగ్య, పోలీసు, విద్యుత్తు, దేవాదాయ, వక్ఫ్, భాషా సాంస్కృతిక శాఖ, ఫ్యాక్టరీలు తదితర శాఖల ద్వారా వివిధ సేవలు అందించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి సమగ్ర కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, ఆర్.ఓ.ఆర్. 1బి సర్టిఫికెట్, కంప్యూటరైజ్డ్ అడంగల్, ఓబిసి సర్టిఫికెట్, మ్యుటేషన్ టైటిల్ డీడ్, పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్ ముద్రించిన కాపీ జారీ, పొసెసన్ సర్టిఫికెట్, ఇంట్లో వివాహం అయిన సభ్యుల రేషన్ కార్డు విభజన, ఇళ్ల స్థలాల పట్టాల జారీ, పట్టా సబ్ డివిజన్ ఆటో మ్యుటేషన్, నోఎర్నింగ్ మెంబర్ సర్టిఫికెట్, అడంగల్, 1బిలో సర్వే నెంబరు చేర్చడం, ఆధార్ నమోదుకోసం అడ్రస్ సర్టిఫికెట్ జారీ, వ్యవసాయ ఆదాయంపై సర్టిఫికెట్ తదితర ధృవీకరణ పత్రాలు ఉచితంగా జారీ చేసినట్లు వివరించారు.